సాక్షి గుంటూరు

శనివారం ; 8 ; ఏప్రిల్ ; 2023



అమరేశ్వరుని సన్నిధిలో..


అమరావతి: అమరేశ్వర స్వామిని ఆక్టోపస్ డీఐజీ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు శేషావస్త్రాలు తీర్థప్రసాదాలతో ఆశీర్వచనం అందజేశారు.



నాగార్జున కొండ సందర్శన

విజయపురిసౌత్: నాగార్జునకొండను భారతీయ పురావస్తు శాఖ డైరెక్టర్(జాతీయ సాంస్కృతిక నిధి) డాక్టర్ వసంతకుమార్ స్వర్ణకార్ శుక్రవారం సందర్శించారు.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6:27	4:40
నరసరావుపేట	6:29	4:39
బాపట్ల	6:27	4:40

న్యూస్‌రీల్

ముగ్గురు ఇన్విజిలేటర్ల సస్పెన్షన్


బాపట్ల అర్బన్: పదో తరగతి పరీక్షల విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ముగ్గురు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ బి.నాగాంజనేయులు, ఓపెన్ స్కూల్ పరీక్షల ప్రభుత్వ డెఫ్ అండ్‌డెమ్ రెసిడెన్షియల్ స్కూల్ వెదుళ్లపల్లిలోని పరీక్ష కేంద్రంలో ఇద్దరు ఇన్విజిలేటర్లు బి.వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్‌లను సస్పెండ్ వేటు వేసినట్లు చెప్పారు. వీరితో చందోలు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.సుబ్బారావు, డీఓ కె.శ్రీనివాసరావు, వెదుళ్లపల్లి సీఎస్ కె.అనిల్‌కుమార్, డీఓ విజయరాజులకు చార్జి మెమోలు జారీ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,300, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.

సాగర్ నీటిమట్టం 528 అడుగులు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 528.40 అడుగుల వద్ద ఉంది. ఇది 165.0408 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,287, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,920, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఔట్‌ఫ్లోగా 9,875 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 7,641 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. నీటిమట్టం 805.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.9380 టీఎంసీలకు సమానం.

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కులు



తాడేపల్లి రూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1316 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 286, పశ్చిమ కెనాల్‌కు 45 క్యూసెక్కులు, , కొమ్మమూరు కాల్వకు 800 క్యూసెక్కులు విడుదల చేశారు.

92.53 శాతం పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక శుక్రవారం జిల్లాలో లబ్ధిదారులకు వలంటీర్లు ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు. గుంటూరు జిల్లాలో శుక్రవారం 92.53 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,52,367 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.34 కోట్లు కేటాయించింది. శుక్రవారం సాయంత్రానికి 2,33,521 మంది లబ్ధిదారులకు రూ.64.38 కోట్ల పంపిణీ పూర్తి చేశారు.





చిలకలూరిపేట మండలం వేలూరులో ప్రజామద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్న మంత్రి విడదల రజిని, రాజుపాలెం మండలం అనుపాలెంలో కరపత్రం అందిస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి, ఎంపీ లావు

ఎటు విన్నా.. ఎటు కన్నా..

- గుంటూరు జిలాల్లో ఘనంగా ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం
- ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు
- భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు
- హాజరైన ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల, డొక్కా

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దేశ చరిత్రలో తొలిసారి ఓ రాజకీయ పార్టీ ఎన్నికలతో సంబంధం లేకుండా నిత్యం ఏదో ఒక కార్యక్రమం పేరిట ప్రజల్లో ఉంటూ తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం పేరిట గతేడాది మే 11 నుంచి నిత్యం వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలతో ఉంటున్నారు. శుక్రవారం నుంచి మరో వినూత్న కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రీకారం చుట్టింది. 'జగనన్నే మా భవిష్యత్' అనే కార్యక్రమంతో మరోసారి ప్రజల వద్దకు వెళుతున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమం గుంటూరు జిల్లాలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 32వ డివిజన్‌లో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను గోడకు అతికిస్తున్న తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

- గుంటూరు తూర్పు నియోజకవర్గం ఒకటో డివిజన్‌లో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డొక్కా మాణిక్యవరప్రసాద్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.
- తెనాలి 20వ వార్డు పరిధిలోని తులసీరామ్ చౌక్‌లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు కార్యక్రమ కిట్లను అందజేశారు.
- పొన్నూరులోని 1వ సచివాలయ పరిధిలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ వలంటీర్లతో కలసి ప్రారంభించారు.



బ్రాడీపేటలోని ఓ కుటుంబానికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల, ఎమ్మెల్యే మద్దాళి

- గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరులో కార్యక్రమాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత లాంఛనంగా ప్రారంభించారు. జేసీఎస్ రీజనల్ కోఆర్డినేటర్ కందుల రవీంద్రారెడ్డి హాజరయ్యారు.
- మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ పరిశీలకుడు నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.
- తాడికొండ మండలం ఫణిదరంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, జేసీఎస్ రీజినల్ ఇన్‌చార్జి రవీంద్రారెడ్డి, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ఇన్నర్ రింగ్‌కు

ముందడుగు

ఫేజ్-3 దశకు రంగం సిద్ధం

- పెద పలకలూరు నుంచి శిల్పారామం వరకు...
- మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులు
- యూబీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు టెండర్..
- 4.21 కిలో మీటర్లకు 3.30 కిలోమీటర్ల వద్ద నిలిచిన పనులు
- త్వరలో పనులు ప్రారంభం....

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలోని మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ పనులు పూర్తి చేసేందుకు రంగం సిద్ధం అయింది. ఫేజ్ 3 పనుల్లో ముందడుగు పడింది. స్వర్ణ భారతీ నగర్ శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు రోడ్డు నిర్మించనున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు. బీటీ రోడ్డుతో పాటు కల్వర్టులు, డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.33 కోట్లు అవుతుందని అంచనా వేశారు. యూబీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు ఈ పనులకు సంబంధించి టెండర్ దక్కింది.

మూడో దశలో..

ఫేజ్-3లో రోడ్డు విస్తరణ కోసం 177 ఇళ్లు తొలగించడంతో పాటు కొన్ని స్థలాలు సేకరించాల్సి ఉంది. అందులో 159 ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఆస్తులు ఉన్నాయి. 18 ప్రభుత్వ భూములు ఉన్నాయి. 159 మందికి టీడీఆర్ బాండ్స్ కేటాయించనున్నారు. వీటి విలువ మూడు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఇప్పటికే 108 మందికి బాండ్లు అప్పగించగా, మరో 51 మందికి బాండ్లు సిద్ధం చేస్తున్నారు. స్వర్ణభారతీ నగర్‌లో 382 ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా తొలగించాల్సి ఉంది. వీటిలో బీ ఫారం పట్టాలు, ఆక్రమణ భూములున్నాయి.

అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చలు

ఇటీవల స్వర్ణభారతీ నగర్‌లో రోడ్డు వలన ప్రభావితం అవుతున్న వారితో మున్సిపల్ కమిషనర్ చేకూరి కీర్తి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు. 80 అడుగుల వెడల్పుతో 4.21 కిలోమీటర్ల నిర్మించాల్సి ఉండగా అందులో ఇప్పటికే 3.30 కిలోమీటర్ల రోడ్ పని పూర్తి అయి స్వర్ణభారతీ నగర్ వద్ద ఆగిపోయినట్లు వివరించారు.



మూడో దశలో అభివృద్ధి చేయనున్న ఇన్నర్ రింగ్‌రోడ్డు

బాధితులకు అండగా..

రోడ్ విస్తరణలో నష్టపోతున్న వారికి అర్హత మేరకు జగనన్న కాలనీల్లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఇంటి స్థలం పట్టా ఇచ్చి, ఇంటి నిర్మాణాలకు కూడా రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో ఉన్న వారికి చట్ట ప్రకారం భూమిపై హక్కులు లేవని, అటువంటి వారికి జగనన్న కాలనీల్లో పక్కా రిజిస్ట్రేషన్ తో ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ కాలనీల్లో మౌలిక వసతులు కూడా వేగంగా అభివృద్ధి చేస్తామని అలాగే ఇళ్లు నష్టపోతున్న వారికి చట్ట ప్రకారం నష్ట పరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారు. చట్ట ప్రకారం ఆక్రమణలను తొలగించి పనులు చేపట్టే అవకాశం ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు కూడా అందరికీ న్యాయం చేసిన తర్వాతే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. త్వరలో కౌన్సిల్‌లో కూడా దీనిపై తీర్మానం చేస్తామని హామీ ఇవ్వడంతో ఎక్కువ మంది దీనికి అంగీకరించారు. త్వరలో మళ్లీ వారితో సమావేశం అయ్యి ఆమోద పత్రాలు తీసుకునేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వస్తే త్వరలోనే రోడ్డు పనులకు ఆటంకాలు తొలుగుతాయి.

జయ ఏసు..శుభ క్రీస్తు



గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుంటూరు విద్యానగర్‌లోని సహాయ మాత చర్చిలో సాయంత్రం శిలువ మార్గం నిర్వహించారు. కాథలిక్ సంఘ బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య, విచారణ గురువు ఫాదర్ గువ్వల బాల రాజు శిలువ మార్గంలో పాల్గొన్నారు. శిలువపై మహా వేదన పొందిన తరువాత ఏసు క్రీస్తు ప్రాణం విడుచుట, ఆయన పవిత్ర దేహాన్ని శిలువ నుంచి దించి సమాధిలో ఉంచుట వంటి ఘట్టాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. అనంతరం బిషప్ భాగ్యయ్య శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రార్థనలు చేశారు.

– పాత గుంటూరు



కృష్ణా టీడీపీలో తిరుగుబావుటా!

- బాబు ఎత్తులకు సీనియర్లు ఝలక్
- దిగుమతి నేతలపై ధిక్కారస్వరం
- అచ్చెన్నకు అంత సీన్ లేదంటున్న ముఖ్యులు
- అధినేత పర్యటనలోగా తాడోపేడో తేల్చుకునేలా...
- భిన్నంగా జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల మార్గదర్శకాలు



సాక్షి ప్రత్యేక ప్రతినిధి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలు తిరుగుబావుటా ఎగురవేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాబు ఎత్తులకు సీనియర్లు చెక్ పెడుతూ పైఎత్తులు వేశారని పరిశీలకులు అంటున్నారు. కృష్ణా నాయకులిచ్చిన ఝలక్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఇదివరకు ఇచ్చిన డైరెక్షన్‌కు పూర్తి భిన్నంగా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఫ్లాష్ మెసేజ్ ఇవ్వాల్సి వచ్చింది. తాజా పరిణామాలు పార్టీలోని ముఖ్య నాయకులు, శ్రేణులను గందరగోళానికి గురిచేస్తున్నాయి.

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రవాసాంధ్రులు, స్థితిమంతులకు ప్రాధాన్యమిచ్చే ప్రక్రియను తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేషలు కొనసాగిస్తున్నారు. ఎన్నికలకు రూ.పదులు, వందల కోట్లను ఖర్చు చేయగలిగే వారికే టిక్కెట్లనే సంకేతాలను రాజకీయ మార్కెట్‌లోకి ఇదివరకే వదిలారు. దీంతో ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు, విభిన్న వర్గాల సంపన్నులు ముఖ్యంగా టీడీపీకి మద్దతిచ్చే సామాజికవర్గీయులు ముందువరుసలో ఉన్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలోనూ వారే కనిపిస్తున్నారు. తాజాగా గుడివాడ నుంచి పోటీకి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు విదేశాల్లో వ్యాపారాలు చేస్తున్న వెనిగండ్ల రాము. గుంటూరు నుంచి ఉయ్యూరి శ్రీనివాస్‌ను ప్రోత్సహించే క్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొక్కిసలాట చోటు చేసుకుని ముగ్గురు పేద మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే.

కృష్ణాలో తాజా పరిణామమిది...

ఉమ్మడి కృష్ణాలో పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టవుతుండటంతో చంద్రబాబు జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నందిగామ, జగ్గయ్యపేటలో ముగియగా ఈ నెల 12– 14 తేదీల్లో మచిలీపట్నం నుంచి గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల మీదుగా నూజివీడు వరకు కార్యక్రమాన్ని ఖరారు చేశారు. మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చంద్రబాబు, లోకేష్‌లను నిత్యం తూర్పారపడుతూ కొరకరాని కొయ్యగా మారిన నేపథ్యంలో గుడివాడలో ఎలాగైనా గట్టిపోటీ ఇవ్వాలనే ఆశతో బాబు ఉన్నారు. ఆ దృష్ట్యానే ఎన్టీఆర్ స్వస్థలమైన నిమ్మకూరులో, గుడివాడలో బాబు బసచేసేలా కార్యక్రమం రూపొందింది.

సీనియర్లు కూడబలుక్కుని...

సీనియర్లయిన కొనకళ్ల, దేవినేని, కొల్లు తదితరులు కూడబలుక్కునే రాముకు సమాచారం ఇవ్వలేదనేది సమాచారం. 'రావి వెంకటేశ్వరరావు ఇంఛార్జిగా ఉన్నారు. సొమ్ములతో ఊడిపడినంత మాత్రాన రాముకు మేం ప్రాధాన్యం ఇవ్వాలా? ఈరోజు రావి, రేపు మాలో ఎవరికైనా ఇలాంటి పరిస్థితే ఎదురుకాదన్న గ్యారంటీ ఏంటి? అధిష్ఠానానికి కూడా మా భావనలు తెలియాలిగా' అని జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు ఒకరు అన్నారు. పార్టీకోసం ఏళ్ల నుంచి కష్టపడిన వారిని పక్కకు తోసేస్తూ డబ్బులున్న వారికే సీటు ఇస్తామంటే చూస్తూ మౌనంగా ఉండాలా? అని మరో నేత ఘాటుగా స్పందించారు. ఇదే అంశాన్ని కొనకళ్ల వద్ద సాక్షి ప్రస్తావించగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సర్క్యులర్ ప్రకారమే తాము నడుచుకున్నామన్నారు. కార్యక్రమం కోసం విభిన్న పనులు ఉంటాయన్నారు.

అచ్చెన్న ఇలా... బాబు అలా...

నాయకులు కొందరు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీకి అప్రతిష్ఠ తెస్తున్నారు. క్రమశిక్షణ లోపిస్తోంది. అలాంటి వారిపై తీవ్ర చర్యలు తప్పవు. తమకు సంబంధంలేని నియోజకవర్గాల్లో ఇతర నాయకులు పర్యటిస్తూ వర్గాలను ప్రోత్సహిస్తూ కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారు. ఇకపై అలాంటివేవీ చేయడానికి వీల్లేదని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి హోదాలో అచ్చెన్నాయుడు కొన్నాళ్ల కిందట ఓ ప్రకటనలో హెచ్చరించారు. గుడివాడ విషయంలో కృష్ణా నాయకులు అచ్చెన్న ప్రకటననే సాకుగా చూపి రావికి ప్రాధాన్యమిచ్చి, రామును దూరం పెట్టి అధిష్ఠానానికి ఝలక్ ఇచ్చారు.

బాబు ఫ్లాష్ మెసేజ్...

కృష్ణా నేతల తిరుగుబాటుకు ఉలిక్కిపడిన చంద్రబాబు పార్టీ నేతలకు ఫ్లాష్ మెసేజ్ పంపారు. 'పార్టీ బలోపేతం కృషిచేసే పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఇంఛార్జుల అనుమతి అవసరం లేదు' అని స్పష్టం చేశారు. ఇది అచ్చెన్న హెచ్చరికకు పూర్తి విరుద్ధంగా ఉండటం పరిశీలనాంశం.

అచ్చెన్న జోక్యం చేసుకుని...

గుడివాడలో కార్యక్రమానికి సంబంధించి తనకు ఆహ్వానం లేదని అలకబూనిన రాము వ్యవహారం అచ్చెన్నాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన్ను వెంటపెట్టుకుని చంద్రబాబు వద్దకు వెళ్లాల్సి వచ్చింది. దీనిపై బాబు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఇకపై ఇలాంటివి జరగకూడదని, రాముకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆయన ద్వారా వనరులను సమకూర్చుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

ఇన్‌చార్జికే జిల్లా నేతల ప్రాధాన్యం

గుడివాడలో వెనిగండ్ల రామును పోటీకి దింపాలనే యోచనలో అధిష్ఠానం ఉండగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా రావి వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. బాబు కార్యక్రమం ఏర్పాట్లలో భాగంగా కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు బుధవారం గుడివాడలో పర్యటించారు. జిల్లా పరిధిలోని నియోజకవర్గ ఇంఛార్జులతో కొనకళ్ల గురువారం ఉదయం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు పాల్గొన్నారు. రాముకు రెండు రోజులూ అధికారికంగా సమాచారం ఇవ్వలేదు. సమావేశానికి పిలవలేదు. బాబు, లోకేష్‌ల ఆదేశాలమేరకు రాము కొన్ని నెలలుగా గుడివాడ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నయనానందకరం.. ఆది దంపతుల నదీ విహారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గంగా పార్వతి(దుర్గా) సమేత మల్లేశ్వర స్వామి వార్ల నదీ విహారం శుక్రవారం నయనానందకరంగా సాగింది. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ ఏడాది ఆది దంపతులకు నదీ విహారం ఏర్పాటు చేశారు. తొలుత మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాల వద్ద స్వామి వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఆది దంపతులకు పూజలు నిర్వహించి నదీ విహారానికి పయనమయ్యారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు దుర్గాఘాట్‌కు చేరుకుంది. పూలతో అలంకరించిన బోటుపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఆది దంపతులను ఉంచి పూజలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులతో పాటు చైర్మన్, ఈఓ తదితర ముఖ్య అధికారులు బోటుపైకి చేరుకున్నారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, యజ్ఞనారాయణ శర్మ, ఇతర అర్చకులు పూజలు నిర్వహించారు. మూడు సార్లు నదిలో ప్రదక్షిణగా తిరిగి దుర్గాఘాట్‌కు చేరుకుంది. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలం, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, నిడమానూరి కళ్యాణి, అల్లూరి కృష్ణవేణి,వెస్ట్ ఏసీపీ హనుమంతరావు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువత ప్రాధాన్యత కీలకం



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు దొక్కా మాణిక్యవరప్రసాద్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకి అయినా యువత ప్రాధాన్యత ఎంతో కీలమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం 'జగనన్న పాలనలో యువత సాధికారిత' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేని యువత బలం వైఎస్సార్ సీపీకి ఉందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి 1.50 లక్షల ఉద్యోగాల్ని కల్పించడంతోపాటు, లక్షలాది మంది నిరుద్యోగులకు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. వాస్తవ పరిస్థితుల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరిగి పట్టం కట్టేందుకు యువత పాటు పడాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళీమోహన్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ యువతకు ఐకాన్ లాంటి వారని తెలిపారు. తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని, దీనిని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత యువతపై ఉందని చెప్పారు. గ్రంథాలయ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కళ్లం హరికృష్ణారెడ్డి, మాట్లాడారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కృష్ణమోహన్, రామకృష్ణారెడ్డి, ఆవుల సుందరరెడ్డి, పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభం
- అట్టహాసంగా ఆరంభించిన ప్రజాప్రతినిధులు
- తొలిరోజు రసవత్తరంగా పోటీలు
- తరలివచ్చిన వేలాది మంది రైతులు



జాతీయ స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

మాచర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జాతీయస్థాయి ఒంగోలుజాతి ఎడ్ల పందేలు నిర్వహించటం అభినందనీయమని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలోని గుంటూరు రోడ్డులో ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో–ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంబరాలలో భాగంగా చేపట్టిన ఎడ్ల బండ్ల లాగుడు, బలప్రదర్శన పోటీలను శుక్రవారం ఎంపీ, ఎమ్మెల్సీ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నిరంతరం మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న వ్యక్తి ప్రభుత్వ విప్ పీఆర్కే అని కొనియాడారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఆయన ఏటా చెన్నకేశవ స్వామి తిరునాళ్ల, ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ వరికపూడిసెలకు అనుమతులు లభిస్తాయని, ప్రతి రైతుకు న్యాయం చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఎడ్ల పందేలకు రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు తరలిరావడం ఆనందంగా ఉందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు మేరాజోత్ హనుమంతునాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు ఉప్పలపాటి జాని, కామనబోయిన కోటయ్య, బూదాల మరియమ్మ, మాచర్ల మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు నాలుగు పళ్ల జతల పోటీలు

మొదటి రోజు నాలుగు పళ్ల జతల పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 14 జతలు పోటీలకు రాగా, రాత్రి వరకు పందేలు జరిగాయి. పోటీలను శ్రీనివాసశర్మ, పోలూరి నరసింహారావు, కొత్తమాసు పాండురంగారావు, బ్రహ్మారావు, చిల్లంచర్ల సత్యనారాయణ, జూలకంటి వీరారెడ్డి, నల్ల వెంకటరెడ్డి, పిన్నెల్లి హనిమిరెడ్డి, గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, బొమ్మిన అల్లయ్య, యరబోతుల శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు, మోర్తాల ఉమామహేశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

శుభాల మాసం రంజాన్



లక్ష్మీపురం: రంజాన్ సందడి ప్రారంభమైంది. మార్చి 24వ తేదీన మాసం పట్టారు. ముస్లిం జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గత రెండు సంవత్సరాల పాటు కోవిడ్ కారణంగా రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలను ఇళ్లల్లోనే జరుపుకున్నారు. ఈ ఏడాది రంజాన్ మాసాన్ని మసీదుల్లో జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఉపవాస దీక్షలు..

రంజాన్ మాసం ప్రారంభం అయి 15 రోజులు పూర్తి అయింది. 15వ రోజు శుక్రవారం కావడం ప్రారంభం రోజు శుక్రవారం కావడంతో ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రంజ్ అంటే దహించుట అని అర్థం. రంజాన్ నెలలో మనస్ఫూర్తిగా దైవ మార్గంలో నడిస్తే పాపాలన్నీ హరించుకుపోతాయని విశ్వసిస్తారు. అందుకే ఉపవాసాలు(రోజా)ప్రత్యేక ప్రార్థనల మీద శ్రద్ధ పెడతారు. ఉపవాసాలు తరావీహ్ ప్రార్థనలు విశ్వాసులకు నిధి అని ఖురాన్‌లో చెబుతోంది. ప్రతి ప్రవక్త కాలంలోనూ రంజాన్ ఉపవాసాలు విధిగానే ఉన్నాయి. మహమ్మద్ ప్రవక్త(స) రంజాన్ నెలలో రాత్రి పగలు ప్రత్యేక ప్రార్థనలు చేసేవారు. రోజా అనేది పారసీక పదం, అరబ్బీలో దీనిని సామ్ అంటారు. రోజా పాటించేవారు నియమాలను తప్పనిసరిగా ఆచరించాలి.

జోరందుకున్న హలీమ్ విక్రయాలు...

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు అందరికీ గుర్తుకు వచ్చే ప్రత్యేక వంటం హలీం. హోటళ్ల ఆవరణలో ప్రత్యేకంగా హలీం బట్టీలను ఏర్పాటు చేస్తారు. జిల్లాలోని గుంటూరు పట్టణంలో తూర్పు నియోజకవర్గంలో పలు హోటళ్లలో, ఖాళీ స్థలాల్లో ఈ హలీమ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం ప్రారంభం అయిన సాయంత్రం నుంచి హలీం విక్రయాలు చేపట్టారు. ముస్లింలతో పాటు అన్ని వర్గాల వారు హలీం, వంటకం రుచి చూసేందుకు మక్కువ చూపుతున్నారు.

పది లక్షల లీటర్ల పాలు చోరీ

పోలీసులకు పిర్యాదు చేసిన బాధితుడు

మంగళగిరి: నగరపరిధిలోని జాతీయరహదారిపై ఓ ప్రైవేటు పాల వాహనంలో ప్రతిరోజూ పాలు చోరీ అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన షేక్ మహబూబ్‌బాషా వడ్లమూడి సంగం డెయిరీ నుంచి పాల ట్యాంకర్ ద్వారా మంగళగిరి పరిసర ప్రాంతాలకు పాలు సరఫరా చేస్తుంటాడు. పాల ట్యాంకర్ డ్రైవర్‌గా 16 నెలల క్రితం చేరిన నల్లపాటి రాములు గత కొద్దినెలలుగా పాల ట్యాంకరు తీసుకొచ్చి మంగళగిరి జాతీయ రహదారి పెట్రోలు బంకు వద్ద ఆపి తన సోదరుడు బాజీ, అతని స్నేహితులను పిలిచి రోజూ 150 నుంచి 200 లీటర్ల పాలు తీసి పేరేచర్లలో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంగం డెయిరీ వారు సప్లయి చేస్తున్న పాలు తగ్గడంతో ట్యాంకరు యజమాని మహబూబ్‌బాషాకు సమాచారం ఇచ్చారు. గత కొన్ని నెలలుగా సుమారు పది లక్షల లీటర్ల పాలు చోరికి గురైనట్లు గుర్తించి శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రైవేటు సంస్థకు గోడౌన్‌గా ఎంఎంకే స్టేడియం

- ఇష్టానుసారం గోడౌన్‌గా మార్చిన వైనం
- నిబంధనల ప్రకారం ఖాళీ చేయించాలని కోర్టు తీర్పు
- నోటీసుల జారీకి రంగం సిద్ధం చేస్తున్న అధికారులు



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎంఎంకే స్టేడియం

మంగళగిరి: ఎంఎంకే స్టేడియాన్ని టీడీపీ నాయకులు గోదాముగా మార్చేశారు. ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. వివరాలు.. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అతివిలువైన స్థలాన్ని ప్రజా అవసరాల నిమిత్తం నామమాత్రపు లీజుతో సుమారు రూ.20 కోట్ల విలువైన స్థలాన్ని ఓ కమిటీ తీసుకుంది. అనంతరం ఆ స్థలంలో మోతుకూరి మాలకొండయ్య(ఎంఎంకే) పేరుతో ఇండోర్ స్టేడియం నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో స్థలం లీజుకు ఇవ్వగా అనంతరం టీడీపీ నాయకుల హస్తగతమైంది. స్టేడియంలో సభ్యత్వం పేరుతో రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 2005లో స్థలం లీజుకు తీసుకుని స్టేడియం నిర్మించిన నిర్వాహకులు లీజు నిబంధనలు అతిక్రమించడంతో 2013లో అధికారులు స్టేడియం ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. వెంటనే కోర్టును ఆశ్రయించి నిర్వాహకులు కాలం గడుపుతుండగా అందులో ప్రధానంగా ఉన్న టీడీపీ నాయకులు, సభ్యులు స్టేడియాన్ని తమ ఇష్టానుసారం వాడుకుంటూ గోడౌన్‌గా మార్చడం విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం గోడౌన్ నుంచి కొన్ని సామన్లు ఆటోకు ఎక్కిస్తుండగా ఈ సామన్లు ఇక్కడ ఎందుకు ఉన్నాయని ఒక వ్యక్తి ప్రశ్నించగా దాడికి పాల్పడినంత పనిచేశారు.

స్పష్టమైన తీర్పు ఉన్నా..

నిర్వాహకులు కోర్టును ఆశ్రయించినా మూడు నెలల క్రితమే కోర్టు స్పష్టంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టేడియం ఖాళీ చేయించి స్వాధీనం చేసుకోవాలని తీర్పు చెప్పినా అధికారులు కనీసం నోటీసులు జారీ చేయలేదు. మంగళగిరి– తాడేపల్లి నగరంగా అవతరించిన నేపథ్యంలో అధికారులు వెంటనే స్టేడియాన్ని స్వాధీనం చేసుకుని నగర ప్రజలందరికీ ఉపయోగపడేలా చూడాలని నగర వాసులు కోరుతున్నారు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

ఈ విషయమై ఎంపీడీఓ బిట్రా శ్రీనివాసరావు వివరణ కోరగా... మూడు నెలల క్రితమే నిబంధనల ప్రకారం స్టేడియాన్ని ఖాళీ చేయించాలని కోర్టు తీర్పునిచ్చింది. తాను వారం క్రితమే బాధ్యతలు తీసుకున్నా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిబంధనల మేరకు స్టేడియాన్ని ఖాళీ చేయించేందుకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

వేద సంరక్షణలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: వేదసంరక్షణలో భాగస్వాములు కావాలని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర స్వామి సూచించారు. కృష్ణా మండల వేదవిద్వత్వవర్ధక సభ ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 75 వార్షిక వజ్రోత్సవాలు, జాతీయస్థాయి వేదపరీక్షలు శుక్రవారం ముగిసాయి. వేద సభల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తున్న నిర్వాహకుల కృషిని స్వామి అభినందించారు.

తాడేపల్లిలో పర్యటించిన జేసీ



బ్రహ్మానందపురంలో ఫారెస్ట్ భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ జి. రాజకుమారి విస్తృతంగా పర్యటించారు. నవరత్నాల్లో భాగంగా ప్రతి ఒక్క లబ్ధిదారుడికి నివాస స్థలాలు కేటాయించేందుకు సీఆర్‌డీఏ పరిధిలో స్థలాలు కేటాయించింది. తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పలుచోట్ల నిషేధిత భూముల్లో పేద ప్రజలు నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నివసించే వారు ప్రమాదం అంచుల్లో ఉండడం, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ నివసిస్తున్న వారికి పక్కా నివాస గృహాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దానిలో భాగంగా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తాడేపల్లిలోని పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో నవరత్నాల్లో భాగంగా అర్హులైన పేదలకు నివాస స్థలాలను కేటాయిస్తున్నామని, కొన్నిచోట్ల అటవీ ప్రాంతంలోను, కాలువ అంచుల్లోను పేద ప్రజలు నివాసముంటున్నారని, ఆ స్థలాలను పరిశీలించి వారికి సైతం ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టుకునేందుకు లోన్లు అందజేస్తుందని, ఎక్కడెక్కడ అబ్జెక్షన్‌బుల్ స్థలాల్లో ఇళ్లు ఉన్నాయో పరిశీలిస్తున్నామన్నారు. ఇక నుంచి తాడేపల్లి ప్రాంతంలో అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఇళ్ల స్థలం కేటాయించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ పరిశీలనా కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ శారదా దేవి, తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, డి.ఇ. కృష్ణారెడ్డి, ఆర్‌ఐలు వంశీకృష్ణ, ప్రశాంతి, ఫారెస్ట్ అధికారులు నరేంద్ర, రవి, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే

– డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ .శ్రావణ బాబు



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎంఏ సభ్యులు

గుంటూరు మెడికల్: దేశాభివృద్ధికి శారీరక ఆరోగ్యంతోపాటు, మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ బాబు అన్నా రు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ప్రజా ఆరోగ్య చైతన్య ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. డాక్టర్ శ్రావణ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పిల్లలు పాఠశాలలో రోజుకు ఒక గంటపాటు తప్పనిసరిగా ఆటలాడే విధంగా చూడాలన్నారు. నేటి చదువులు పిల్లలలోఎంతో మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని, ఆ ఒత్తిడిని తగ్గించడంలో ఆటలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వ్యాధుల బారిన పడకుండా క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలన్నారు. ఆహార నియమాలు పాటించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐఎంఏ రాష్ట్ర ఎలెక్ట్ అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్, గుంటూరు శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్ , సంయుక్త కార్యదర్శి డాక్టర్ డి.అమరలింగేశ్వర రావు, ఐఎంఏ సభ్యులు డాక్టర్ వి.వి.రాం కుమార్, డాక్టర్ జి సతీష్ కుమార్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ కె.శివకుమార్, డి శ్రీనివాసరావు, లాల్ వజీర్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపుదలతో అభివృద్ధి



వాలంటీర్లకు బాండ్లు అందజేసి సన్మానం చేస్తున్న అంబటి మురళీకృష్ణ



గుంటూరులో విద్యార్థులతో ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణ

భజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

బాపట్ల టౌన్: నిన్నటి కంటే నేడు మెరుగ్గా ఉండటమే నిజమైన అభివృద్ధి అవుతుందని, పేద ప్రజల జీవన ప్రమాణ స్థాయి మెరుగుపరచడానికి భజరంగ్ ఫౌండేషన్ తనవంతు సహాయాన్ని తప్పక అందిస్తుందని ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా బాపట్ల నియోజకవర్గంలోని స్టువర్టుపురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సేవా కార్యక్రమాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్టువర్టుపురం గ్రామ పరిధిలోని కిశోర బాలికలు, మహిళలకు శానిటరీ నాప్‌కిన్‌లను భజరంగ్ తరఫున పంపిణీ చేశారు. గ్రామంలోని విద్యార్థినీ, విద్యార్థులకు, వివేక్ విద్యాశ్రమ్ హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేసి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడు తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పాలనను స్ఫూర్తిగా తీసుకుని, భజరంగ్ జగన్నామ సంవత్సరం కార్యక్రమాలు రూపు దిద్దుకున్నాయని తెలిపారు. మహిళలు తమ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తతో మెలగాలన్న సందేశంతో శానిటరీ నాప్ కిన్‌లను అందిస్తున్నట్లు వెల్లడించారు. అమ్మఒడి, విద్యా దీవెన పథకాలకు సంఘీభావంగా విద్యార్థులందరికీ పరీక్షా ప్యాడ్లను, చిన్నారులకు పలకలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జగనన్న సంక్షేమ పాలనలో కీలక భూమిక వహిస్తున్న వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేసేందుకు వలంటీర్లకు తగిన గౌరవాన్ని, సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని భజరంగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 15 మంది వలంటీర్లకు రూ.5 లక్షల బీమా బాండ్లను అందించామన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల వలంటీర్లలో మరింత అవగాహన పెంపొందించే దిశగా వారికి పోటీ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాపట్ల మండలం ఎంపీపీ కళ్ళం హరినాథ్‌రెడ్డి, స్టువర్టుపురం సర్పంచ్ బోగిరి ప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యువతిని మోసం చేసిన యువకుడు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం పారిశ్రామికవాడలో ఓ యువకుడు ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఓ యువతి మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. శుక్రవారం పోలీసుల కథనం ప్రకారం... యర్రబాలెం పారిశ్రామిక వాడకు చెందిన శృతి అనే యువతిని అదే ప్రాంతానికి చెందిన సుధీర్ అనే యువకుడు గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నాడు. శారీరకంగానూ దగ్గరయ్యాడు. అనంతరం తనను వివాహం చేసుకోవాలని యువతి పట్టుబడితే అప్పటికే తనకు పెళ్లి అయిందని, తాను వివాహం చేసుకోనని బదులిచ్చాడు. తనతో తిరిగిన ఫొటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని, అవసరమైతే సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో యువతి తనకు న్యాయం చేయాలంటూ మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.